క్లుప్తంగా

వృద్ధులకు కళ్లజోళ్లు పంపిణీ



వృద్ధులకు కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కోలా గంగా భవానీ

ముమ్మిడివరం: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ముమ్మిడివరం మండలం గేదిల్లంక గ్రామంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన 70 మంది వృద్ధులకు ఎంపీపీ కోలా గంగా భవానీ చేతుల మీదుగా ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోలా బాబ్జీ, సర్పంచ్ సానబోయిన పల్లయ్య, జంపన శ్రీనురాజు, నిమ్మన బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

భగీరథ మహర్షి జయంతి వేడుకలు



భగీరథుని చిత్రపటానికి పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణి

అమలాపురం టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో భగరీథ మహర్షి జయంతి కార్యక్రమం గురువారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథ మహర్షి చిత్రపటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడులు పూల మాలలు వేసి పూజలు చేశారు. భగీరథుడు తన తపో శక్తితో గంగను దివి నుంచి భూమిపైకి తెచ్చిన మహనీయుడని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నాని రాజు, కౌన్సిలర్లు సంసాని బులినాని, మట్టపర్తి నాగేంద్ర, దొమ్మేటి రాము, నాగారపు వెంకటేశ్వరరావు, బందారు గోవిందు పాల్గొన్నారు.

రూ.5 లక్షల చెక్కు అందజేత

ఉప్పలగుప్తం: మండలంలోని కూనవరం గ్రామంలో ఇటీవల కాలంలో విద్యుద్ఘాతంతో మరణించిన కొప్పిశెట్టి రామస్వామి కుటుంబాన్ని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ గురువారం పరామర్శించి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వాకపల్లి ఈశ్వరి, అమలాపురం జనసేన అసెంబ్లీ ఇన్‌చార్జ్ శెట్టిబత్తుల రాజబాబు, పార్లమెంటు ఇన్‌చార్జ్ డీఎంఆర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.10 వేల విరాళం



అన్నదాన పథకానికి విరాళం అందజేస్తున్న దాత

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి రూ.10 వేలు విరాళంగా కొత్తలంక గ్రామానికి చెందిన కముజు గోపాలం(లేటు) కుటుంబ సభ్యులు ఆలయ పర్యవేక్షణాధికారి బి.వీరభద్రరావుకు గురువారం అందజేశారు.

మల్లాడిని కలిసిన ఎంపీపీ రాయుడు సునీత

యానాం: చెన్నైలో జరిగిన రోడ్డు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన మాజీ మంత్రి, ఢిల్లీలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావును గురువారం తాళ్లరేవు మండల పరిషత్ అధ్యక్షురాలు రాయుడు సునీత, రాయుడు గంగాధర్ కలిశారు. ఈ సందర్భంగా ప్రమాద ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కోరంగి ఉపసర్పంచ్ కామాడి భైరవమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు పాలెపు పోషియ్య తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై శిక్షణ

అల్లవరం: పాఠశాలల్లో జరిగే వివిధ కార్యక్రమాల అమలు, నిర్వహణ తీరును పరిశీలించేందుకు పాఠశాలల సామాజిక తనిఖీపై అల్లవరం మండల రిసోర్సు కార్యాలయంలో గురువారం శిక్షణ నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి ఎం.కిరణ్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిసోర్సుపర్సన్ సీహెచ్‌వీ నందన్, కనక లింగేశ్వరరావులు ప్రధానోపాధ్యాయులకు సామాజిక తనిఖీపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రుల చేత తనిఖీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమ పరిశీలకులుగా జిల్లా సమగ్ర శిక్ష సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, ఎంకే భీమారావు హాజరయ్యారు.

వేధిస్తున్న భర్త అరెస్ట్

యానాం: భార్యను అదనపు కట్నం తేవాలంటూ వేధిస్తున్న భర్తను యానాం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ శేరు నూకరాజు తెలిపిన వివరాల ప్రకారం యానాం గుమ్మళ్లవీధికి చెందిన ఆకుల నాగదేవికి అమలాపురానికి చెందిన గుండుమగుళ్ల నాగబాబుకు కొన్నేళ్ల క్రితం వివాహమైంది. అయితే అదనపు కట్నం తేవాలంటూ భర్త నాగబాబుతో పాటు ఆదిలక్ష్మి, గొల్ల సూర్యకళ, దుర్గాప్రసాద్, సూర్యకాంతంలు వేధిస్తున్నారని నాగదేవి పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో విచారణ చేసి భర్త నాగబాబును అరెస్ట్ చేయగా రిమాండు విధించారని ఎస్‌ఐ తెలిపారు.

తాటిముంజెలు.. ఆరోగ్యానికి మేలు..

- వేసవి నేపథ్యంలో పెరుగుతున్న గిరాకీ
- పట్టణాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్న యువకులు

ఐ.పోలవరం: ఎండలు మండుతున్న వేళ ఉష్ణతాపాన్ని నివారించే గుణాలున్న తాటి ముంజెలు చేసే మేలు అంతా ఇంతా కాదు. అయితే కాలక్రమేణా ఇళ్ల నిర్మాణాలకు, ఆక్వా చెరువులకు, ఇతర పనులకు ఉపయోగించుకునేందుకు పల్లెల్లో తాటి చెట్లను ఇబ్బిడిముబ్బిడిగా నరికేస్తుండడంతో తాటి ముంజెలకు తీవ్ర కొరత ఏర్పడింది. ప్రస్తుతం అదే కొరత కారణంగా తాటి ముంజెలకు డిమాండ్ సైతం పెరిగింది. దీంతో గ్రామాల్లోని యువత వేసవి కాలమంతా తాటి ముంజెల విక్రయాన్ని జీవనాధారంగా మార్చుకుంటున్నారు.

పల్లెల నుంచి పట్టణాలకు

గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా కనపడే తాటి చెట్ల నుంచి తాటి ముంజెలను యువకులు మండల కేంద్రాలు, పట్టణాలకు తరలిస్తున్నారు. వేసవి తాపాన్ని తట్టుకోవడంతో పాటు మంచి పోషక విలువలున్న తాటి ముంజెలు రైతులు, యువకులకు లాభసాటి వ్యాపారంగా మారింది. ఏటా ఏప్రిల్ నుంచి జూన్ వరకూ పల్లెల్లోని తాటి ముంజెలను తీసి వాటిని దూరంగా పట్టణాలు, నగరాలకు వెళ్ళి అమ్ముతున్నారు. అధిక సంఖ్యలో యువకులు మోటారు సైకిళ్ళపై వాటిని తెచ్చుకుని కోనసీమ జిల్లాలోని అన్ని మండలాల్లో విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ప్రాంతాన్ని బట్టి డజన్ తాటి ముంజెలు రూ.30 నుంచి రూ.50 ధరకు అమ్ముతున్నారు. మోటారు సైకిళ్లపై తాటి ముంజెలను తీసుకెళ్లి విక్రయించి మధ్యాహ్నానికి ఇళ్ళకు చేరుతున్నామని తాటి ముంజెల విక్రయదారుడు సీతయ్య తెలిపారు. రవాణా ఛార్జీలతో సహా ఖర్చులు పోగా రోజుకు రూ.1,000 వరకూ సంపాదిస్తున్నామంటున్నారు.



తాటి ముంజెలు తీసి విక్రయిస్తున్న యువకుడు



ముంజెల్లో పోషక విలువలెన్నో...

తాడిచెట్టును ఇంగ్లిష్‌లో పల్మైరాట్రీ అని, శాస్త్రీయంగా బోరాసస్ ఫ్లాబెలీఫెర్ అని పిలుస్తారు. తాడిచెట్టులో అన్ని భాగాలు ఉపయోగపడతాయి. వీటి నుంచి తీసే ముంజెలను వేసవి తాపం తీర్చేందుకు విరివిగా ఉపయోగిస్తున్నారు. 100 గ్రాముల ముంజెలను తీసుకుంటే వాటిలో 92.5 గ్రాముల నీరు, 0.6 గ్రాముల ప్రోటీన్‌లు, 0.1 గ్రాముల కొవ్వు, 0.2 గ్రాముల బూడిద, 0.2 గ్రాముల పీచుపదార్థాలు, 6.4 గ్రాముల కార్బోహైడ్రేట్స్, 12 మిల్లీ గ్రాముల కాల్షియం, 21 మిల్లీగ్రాముల ఫాస్పరస్, 0.3 మిల్లీ గ్రాముల ఇనుప ధాతువు, 61 మిల్లీ గ్రాముల ఆస్కార్బిక్ ఆమ్లము ఉంటాయని శాస్త్రవేత్తలు, వైద్యులు చెబుతున్నారు.

వేసవిలో ముంజెలతో మేలు



వేసవికాలంలో దొరికే తాటి ముంజెలు తినడం వల్ల దాహార్తిని అరికట్టడమే కాకుండా శరీరానికి అనేక పోషకాలు అందుతాయి. వంద గ్రాముల ముంజెలను తినడం వల్ల తాపం తగ్గటమే కాకుండా 28.9 కిలో కేలరీల శక్తి లభిస్తుంది. అందుకే వేసవిలో కొబ్బరి బొండాలతో పాటు తాటి ముంజెలను తీసుకోవాలి.

– కె.ఇందిరాశ్రీ, పీహెచ్‌సీ వైద్యాధికారిణి, జి.వేమవరం

గోసేవ చేస్తే పూర్ణాహుతి చేసినట్లే

ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



అమలాపురం రూరల్: గోవును పూజించండి అని శాస్త్రాలు ఎందుకు చెబుతున్నాయో గుర్తించాలని, ఒక చేత్తో ఆవుకు గడ్డి పరకలు తినిపిస్తే హోమం చేసి పూర్ణాహుతి చేసినట్లేనని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో వేంకటేశ్వరస్వామి అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజు గురువారం రాత్రి చాగంటి కోటేశ్వరరావు భక్తులకు వేంకటేశ్వరస్వామి అవతారం గురించి వివరించారు. అమ్మకు ప్రదక్షిణ చేసి నమస్కరిస్తే కాశీ యాత్ర చేసినంత పుణ్యం దక్కుతుందన్నారు. తొలుత చాగంటి కోటేశ్వరరావుకు వేదపడింతులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆయనను కిమ్స్ అధినేత కేవీవీ సత్యనారాయణరాజు సత్కరించారు.

మహనీయుల బాటలో నడవాలి

ఉప్పలగుప్తం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ వంటి మహనీయుల బాటలో అందరూ నడవాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. మండలంలోని నంగవరం గ్రామంలో మంత్రి పినిపే విశ్వరూప్ సమకూర్చిన నిధులతో ఏర్పాటుచేసిన అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల్ని గురువారం ఆయన ప్రారంభించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ బలహీనవర్గాల్ని సైతం చట్ట సభల్లోకి తీసుకెళ్లిన నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. కార్యక్రమంలో మంత్రి తనయుడు శ్రీకాంత్, తొత్తరమూడి బాబులు, సర్పంచ్ జిన్నూరి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజాకుమారి తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, శ్రీకాంత్

గాడిలంకలో జగనన్నే మా భవిష్యత్

ముమ్మిడివరం: మండలంలోని గాడిలంకలో గురువారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ కోలా గంగాభవానీ, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్ని వివరించారు. జగనన్న ప్రభుత్వంపై అభిప్రాయం తెలుపుతూ మిస్డ్ కాల్ ఇవ్వాలని ప్రజలకు సూచించారు. కరపత్రాలను పంపిణీ చేస్తూ ఇంటింటా స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి మునీంద్రరావు, ఎంపీటీసీ సభ్యురాలు గిరిగి వీర దుర్గా కుమారి, కోలా బాబ్జీ, నగుబత్తు రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



గాడిలంకలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

పట్టుదలతో ఉన్నత స్థానాలు సాధించాలి

కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: విద్యార్థులు కృషి పట్టుదలతో కష్టపడి చదివి ఉన్నత స్థానాలు సాధించాలని కలెక్టర్ హిమాన్షుశుక్లా అన్నారు. సర్ సీవీ రామన్ పాఠశాల ప్రాంగణంలోని సహస్ర స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా జడ్జి కె.సురేష్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణిలు హాజరై విద్యార్థులకు అవార్డులు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీధర్, జిల్లా జ్యుడిషియల్ జడ్జి పి.వెంకట ప్రసాదరావు, మున్సిపల్ కమిషనర్ అయ్యప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తదితరులు

విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే అశోక్

యానాం: ఇంటర్మీడియట్ పరీక్షల్లో రీజియన్ స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన రీజెన్సీ విద్యార్థులను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ ఘనంగా సత్కరించారు. గురువారం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు టి.తేజస్విని, ఆర్.ప్రేరిత, టి.చందన, మల్లాడి మిథుల, పి.ఉదయసాయి, జి.పూర్ణిమ, నివేత, ఎం.దీపిక, కె.తనయ్, ఎస్.జెస్సిక, యుక్తాముఖి, వి.శ్రావణి, డి.దినేష్‌లను ఎమ్మెల్యే అశోక్ సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మార్తాండప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు టీవీఎస్ఎస్‌వీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ శ్రమదానం



భట్లపాలెంలో శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

అమలాపురం రూరల్: భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ స్పెషల్ క్యాంపులో భాగంగా ఇందుపల్లి గ్రామంలో స్వచ్ఛభారత్ ర్యాలీని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వివరించారు. వీధులను, డ్రైనేజీలను శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లారు. ఇందుపల్లి మంచినీటి చెరువు చుట్టూ ఉన్న తుప్పలను నరికి శ్రమదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చొల్లంగి శివాలిని, కళాశాల ప్రిన్సిపాల్ రామారావు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

మన్‌కీబాత్ ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు

అమలాపురం రూరల్: ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీబాత్ 100వ ఎపిసోడ్ ప్రత్యక్ష ప్రసారానికి పార్లమెంట్ నియోజకవర్గంలో పరిధిలో 50 చోట్ల ఏర్పాట్లు చేస్తున్నట్టు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు తెలిపారు. అమలాపురం పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన ఆదివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ మన్‌కీబాత్ 100వ ఎపిసోడ్ ప్రసారం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దూరి రాజేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

తాళ్లరేవు: మండల పరిధిలోని గాడిమొగ, కోరంగి పంచాయతీల పరిధిలో రూ.1.35 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ గురువారం శంకుస్థాపనలు చేశారు. గాడిమొగ పంచాయతీ గాడిమొగ గ్రామంలో రూ.72 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో వాటర్ ట్యాంకు నిర్మాణానికి, రూ.35 లక్షల వ్యయంతో పెదవలసల గ్రామంలో వాటర్ ట్యాంకు నిర్మాణానికి, కోరంగి పంచాయతీ పరిధిలోని చినబొడ్డు వెంకటాయపాలెంలో రూ.28 లక్షల వ్యయంతో ఏటిగట్టు రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, వైస్ ఎంపీపీ కొపనాతి లలిత, గాడిమొగ, కోరంగి సర్పంచ్‌లు కామాడి గోవలక్ష్మి, పెయ్యల మంగేష్, ఉపసర్పంచ్‌లు కొక్కిలిగడ్డ లోకేష్, కామాడి భైరవమూర్తి తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తదితరులు

ఎమ్మెల్యే అశోక్‌ను కలిసిన మున్సిపల్ కమిషనర్

యానాం: యానాం మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా నియమితులైన పీసీఎస్ అధికారి ద్విజ్‌గోయల్ గురువారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే కార్యాలయానికి తొలిసారిగా వచ్చిన ఆయనను ఎమ్మెల్యే అశోక్ దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం స్వచ్ఛ యానాం లక్ష్యంగా పనిచేయాలని గోయల్‌కు ఎమ్మెల్యే అశోక్ సూచించారు. అనంతరం గోయల్ మాట్లాడుతూ త్వరలో పారిశుద్ధ్య పనులు, స్వచ్ఛత ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరు మేడిశెట్టి రామలింగమూర్తి, మేనేజర్ ఖండవల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గోయల్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే అశోక్

డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

యానాం: నియోజక వర్గ పరిధిలో డెంగీ జ్వరాలు ప్రబలిన ప్రాంతాల్లో ఆర్ఏఓ మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ద్విజ్‌గోయల్‌లు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా మెట్టకూరు ఫిషర్ మెన్‌పేట, మెట్టకూరు రమాభాయినగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్యం ఎలా ఉందో పరిశీలించారు. జ్వర పీడితులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. మున్సిపాలిటీ పరంగా ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన పారిశుధ్య కార్యక్రమాల గురించి చర్చించి సిబ్బందికి సూచనలిచ్చారు.

వాటర్ వర్క్స్ విభాగ పనితీరు అస్తవ్యస్తం

- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ధ్వజం
- ఏఈ ఉండగా ట్యాప్ ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జిగా వ్యవహరించడమేంటన్న చర్చ

అమలాపురం టౌన్: స్థానిక మున్సిపాలిటీ వాటర్ వర్క్స్ విభాగం పని తీరు సక్రమంగా లేదంటూ కౌన్సిల్‌కు చెందిన పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు మూకుమ్మడిగా ధ్వజమెత్తారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన స్థానిక మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ హాలులో కౌన్సిల్ సమావేశం గురువారం ఉదయం జరిగింది. ఈ సందర్భంగా వాటర్ వర్క్స్ విభాగంలో ఓ ట్యాప్ ఇన్‌స్పెక్టర్ నియంతలా వ్యవహరిస్తున్నాడని కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, గొవ్వాల రాజేష్ ధ్వజమెత్తారు. వాటర్ వర్క్స్ పర్యవేక్షించే ఏఈ ఉండగా ట్యాప్ ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జిగా ఉండటమేంటని డీఈఈ అప్పలరాజును నిలదీశారు. మెయిన్ పైపు లైన్ల మరమ్మతులొస్తే ట్యాప్ ఇన్‌స్పెక్టరే చేయాల్సి ఉండగా కింది సిబ్బందిచే చేయించడమేంటని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు స్పందించి పూర్తి స్థాయి విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు. గాంధీనగర్, ఏవీనగర్‌ల్లో వాటర్ ట్యాంకు నిర్మాణ పనుల ప్రారంభానికి జాప్యమెందుకు జరుగుతుందని జనసేన కౌన్సిలర్లు తిక్కా సత్య లక్ష్మి, యేడిద శ్రీను లేవనెత్తిన అంశం పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య వాగ్వాదానికి దారి తీసింది. పన్నుల వసూళ్లలో అమలాపురం మున్సిపాలిటీ జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచినందుకు కౌన్సిల్ సభ్యులంతా హర్షం వ్యక్తం చేశారు. తొలుత మున్సిపల్ మాజీ చైర్మన్ ఉంద్రు బుల్లియ్య మృతికి కౌన్సిల్ సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించింది. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, కౌన్సిలర్లు సంసాని బులినాని, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో వాటర్ వర్క్స్ విభాగం అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

ప్రభుత్వానికి ప్రజల సంపూర్ణ మద్దతు

- కౌన్సిల్‌లో చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్
- మీ అసంతృప్తిని ప్రజలపై రుద్దొద్దంటూ టీడీపీ సభ్యులకు హితవు

ముమ్మిడివరం: ప్రభుత్వానికి ప్రజలు సంపూర్ణ మద్దతు పలుకుతున్నారని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మీ అసంతృప్తిని ప్రజలపై రుద్దే ప్రయత్నం మానుకోవాలని టీడీపీ సభ్యులకు ఆయన హితవు పలికారు. నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. తొలుత అజెండాలోని అంశాలు కౌన్సిల్‌కు వివరిస్తుండగా ప్రతిపక్ష టీడీపీ సభ్యులు చైర్మన్ పోడియం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కౌన్సిలర్‌గా ఎన్నికై రెండేళ్లయినా వార్డుల్లో ఎటువంటి అభివృద్ధి జరగలేదని ప్రజలు తమను అడుగుతుంటే ఏంచెప్పాలో తెలియడం లేదని ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ ఆరోపించారు. దీనిపై చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ స్పందిస్తూ అధికార, ప్రతిపక్షమన్న తేడా లేకుండా అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిస్తున్నామని, అయినా ప్రతిపక్ష సభ్యులు కావాలనే లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లినపుడు ప్రజలు తమ ప్రభుత్వంపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేస్తున్నారన్నారు. 6వ వార్డులో మంచినీటి పైపులైన్ లీకై నీరు వృథాగా పోతుందని ఎన్నిసార్లు చెప్పినా సమస్య పరిష్కారమవ్వడం లేదని కౌన్సిలర్ మహాలక్ష్మి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నానాజీ సరైన వివరణ ఇవ్వకపోవడంతో చైర్మన్ ప్రవీణ్‌కుమార్ తీవ్ర అసహనం వ్యక్తం చేసి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. కౌన్సిల్‌లో వివిధ పనులకు సంబంధించి ప్రవేశపెట్టిన బిల్లులను సభ్యులు ఆమోదించారు. సమావేశంలో కమిషనర్ జి.లోవరాజు, వైస్ చైర్మన్లు రెడ్డి హేమసుందరి, వేటుకూరి బోసురాజు, కౌన్సిలర్లు బొంతు సత్యశ్రీనివాస్, సరిపెల్ల రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో సమస్యలపై చర్చిస్తున్న సభ్యులు

క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తిస్తే చికిత్స సులభం

తాళ్లరేవు: క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే చికిత్స అందించడం సులువని కాకినాడ మెడికవర్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ప్రసూబ్ అన్నారు. గురువారం కమ్యూనిటీ పారా మెడిక్స్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక లయన్స్ క్లబ్ హాలులో జరిగిన కార్యక్రమంలో ప్రసూబ్ మాట్లాడుతూ నేడు మహమ్మారిలా ప్రజల ప్రాణాలు తీస్తున్న క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం చాలా ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా క్యాన్సర్ వ్యాధుల చికిత్స విధానాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో యానాం, తాళ్లరేవు పీఎంపీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ పనులకు వర్క్ ఆర్డర్

యానాం: యానాం భూసమేత వేంకటేశ్వరస్వామివారి నూతన ఆలయం నిర్మాణానికి సంబంధించి వారం రోజుల్లో వర్క్‌ఆర్డర్ ఇవ్వనున్నారని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి, టీటీడీ సభ్యుడు మల్లాడి కృష్ణారావు తెలిపారు. గురువారం ఆయన వెంకన్న ఆలయ స్థలాన్ని పరిశీలించారు. మొదటి నిర్మాణ దశకు నటరాజన్ అనే కాంట్రాక్టర్ టెండర్ పొందారన్నారు. తొమ్మిది నెలల్లో మొదటిదశ పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఈ ఆలయ నిర్మాణానికి సంబంధించి శ్రీవాణి ట్రస్ట్ ద్వారా టీటీడీ దేవస్థానం రూ.3 కోట్లు ఇస్తుందని, ఇప్పటికే దేవాలయ నిర్మాణ కమిటీ రూ.2.71 కోట్లను డిపాజిట్ చేసిందన్నారు. మొత్తం రూ.5.71 కోట్లతో మొదటి దశ ఆలయ నిర్మాణం జరుగుతుందన్నారు. రెండో దశ నిర్మాణానికి మరో రూ.3 కోట్లు అవసరమవుతాయని, ఆ సొమ్మును విరాళాల ద్వారా సేకరించేందుకు కమిటీ చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో గుత్తుల జయరామారావు, కాపగంటి ఉమాశంకర్, మంచాల సత్యసాయి కుమార్, మల్లాడి శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణ మ్యాపును పరిశీలిస్తున్న టీటీడీ సభ్యుడు మల్లాడి కృష్ణారావు

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా

అల్లవరం: ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. ఆధ్వర్యంలో అల్లవరం–2 సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, మంత్రి విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కొత్త ఏడాదిలో అవ్వాతాతలకు నెలకు రూ.3,000 పింఛన్ ఇవ్వనున్నామని వారు తెలిపారు. వృద్ధులకు ప్రభుత్వమిచ్చే పింఛన్ భరోసా కల్పిస్తుందన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ఆయన్ని దీవించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్ బొమ్ము బాలవేణి, సొసైటీ చైర్మన్ యల్లమిల్లి బోసు, నోడల్ అధికారి జి.సరోవరరావు, ఎంపీటీసీ నిచ్చెన కోళ్ల మైనిక, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహసారథుల కన్వీనర్ తిక్కా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల లబ్ధి వివరాలను వృద్ధులకు అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, శ్రీకాంత్

నాణ్యతపై క్వాలిటీ కంట్రోల్ అధికారుల తనిఖీలు

అల్లవరం: మండలంలో రూ.7.57 కోట్ల నిధులతో నిర్మాణంలో ఉన్న గ్రామీణ రోడ్లను విశాఖపట్నం క్వాలిటీ కంట్రోల్ ఈఈ ప్రసాద్ నేతృత్వంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. డి.రావుల పాలెం సెంటర్ నుంచి బాబానగర్‌కు రూ.1.8 కోట్ల నిధులతో 2.39 కిలోమీటర్ల పొడవునా బీటీ రోడ్డు, కొమరగిరిపట్నం కనకమహలక్ష్మి అమ్మవారి ఆలయం నుంచి కడదారి వరకు రూ.3.29 కోట్ల నిధులతో 1.98 కిలోమీటర్ల బీటీ రోడ్డు, సామంతకుర్రు ప్రధాన రహదారి నుంచి గాంధీనగర్ మేజర్ డ్రైన్ వరకు రూ.2.48 కోట్ల నిధులతో 2 కిలోమీటర్ల సీసీ రోడ్డు, బీటీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం క్వాలిటీ కంట్రోల్ డీఈఈ సురేష్, డీఈఈ అన్యం రాంబాబు, జేఈ శేషయ్య, ఏఈ అహమ్మద్ పాల్గొన్నారు.



సామంతకుర్రులో రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు